క్లుప్తంగా

వైభవంగా పెద్దేటమ్మ ఆలయ వార్షికోత్సవం



పొన్నూరు: మండల పరిధి మామిళ్లపల్లిలోని శ్రీ పెద్దేటమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆడబిడ్డలను కంటికి రెప్పలా కాపాడుకోవాలి



ప్రత్తిపాడు: ఆడబిడ్డలను తల్లిదండ్రులు కంటికి రెప్పలా కాపాడుకోవాలని ప్రత్తిపాడు సెక్టార్ సూపర్‌వైజర్ ఎస్. భారతి అన్నారు. భేటీ బచావో భేటీ పఢావో కార్యక్రమంలో భాగంగా గురువారం మండల పరిధిలోని యనమదల డీడబ్ల్యూ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భవతులు, బాలింతలు, మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆడ శిశువులకు జన్మనిచ్చిన బాలింతలకు సీతాఫలం మొక్కలను పంపిణీ చేశారు. తల్లిదండ్రులు ఆడపిల్ల పుట్టిందని బాధపడకుండా వారి ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేయాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాలికల సంరక్షణకు, వారి హక్కులను కాపాడేందుకు, రక్షణకు అనేక చట్టాలు అమలు చేస్తున్నాయని వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేయండి



పొన్నూరు: వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేయాలని పార్టీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధికార ప్రతినిధిగా ఎంపికైన పొన్నూరు చెందిన యందేటి వెంకట సుబ్బయ్య గురువారం గుంటూరులోని అంబటి మురళీకృష్ణ కార్యాలయంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీలో తనకు ప్రాధాన్యతనిచ్చి పదవిని అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం పని చేస్తానని తెలిపారు. అనంతరం మురళీకృష్ణను సత్కరించారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



కాకుమాను: వచ్చే నెలలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించే విధంగా మండలంలోని అన్ని పార్టీ నాయకులు, అధికారులతో సహకరించాలని తహసీల్దార్ శంకర్ బాబు కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం మండలంలోని అన్ని పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అన్ని పార్టీ నాయకులు సమన్వయంతో పని చేస్తూ ప్రశాంతంగా ఎన్నికలు పూర్తయ్యే విధంగా అధికారులకు సహకరించాలని ఆయన కోరారు. మండలంలో పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పార్టీ నాయకులు ప్రోటోకాల్ పాటించాలని సూచించారు.

క్యాన్సర్‌పై విద్యార్థినులకు అవగాహన అవసరం

గుంటూరు మెడికల్: సర్వేకల్ క్యాన్సర్ అవగాహన మాసాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక పాత గుంటూరు వీఆర్ హైస్కూల్‌లో శ్రీ బాలాజీ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. గైనకాలజిస్ట్ డాక్టర్ ఎ.సంధ్యారాణి మాట్లాడుతూ యువతుల్లో ఎక్కువగా సర్వేకల్ క్యాన్సర్ పెరిగిపోతోందని తెలిపారు. ప్రతి ఒక్కరూ వ్యాధిపై అవగాహన కలిగి ఉండటం ద్వారా కట్టడి చేయవచ్చని చెప్పారు. 45 సంవత్సరాలు దాటిన మహిళలు, బాలికలు వ్యాక్సిన్ వేయించుకోవడం ద్వారా సర్వేకల్ క్యాన్సర్ బారిన పడకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. వ్యాక్సిన్ రూ.1800లకే అందిస్తున్నామని, ప్రతి ఒక్కరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

ఉత్తమ పంచాయతీలో సమస్యల తిష్ట

- నడింపాలెంలో అధ్వానంగా మురుగు కాలువల నిర్వహణ
- ఏపుగా పెరిగిన పిచ్చిచెట్లు
- రంగుమారి మైదానంలా పచ్చగా కనిపిస్తున్న మురుగు కాలువలు



మురుగు కాలువల్లో పెరిగిన పిచ్చి చెట్లు



మెయిన్ రోడ్ వెంబడి ముందుకు పారని మురుగు

ప్రత్తిపాడు: ఉత్తమ పంచాయతీ నడింపాలెంలో సమస్యలు తిష్ట వేశాయి. ఒకప్పుడు స్వచ్ఛతలో రాష్ట్రస్థాయి పురస్కారాలు అందుకున్న గ్రామ పంచాయతీ, ఇప్పుడు అధికారుల నిర్లక్ష్యంతో అపరిశుభ్రానికి ఆనవాళ్లుగా మారింది. ఢిల్లీ స్థాయిలో పురస్కారాన్ని అందుకున్న పంచాయతీలో కనీసం మురుగు కాలువలు శుభ్రం చేసే నాథులే కరువయ్యారు. మురుగు ముందుకు పారని పరిస్థితి చోటు చేసుకుంది. సైడు కాలువల పరిస్థితి అధ్వానంగా తయారయ్యింది. నెలల తరబడి సిల్టు తీయించకపోవడంతో దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. గ్రామంలోని కొన్ని ప్రాంతాల్లో మురుగు కాలవల్లో చెట్లు పెద్దఎత్తున పెరిగి అధికారుల నిర్లక్ష్యాన్ని వెక్కిరిస్తున్నాయి. మెయిన్ రోడ్డు పక్కన అయితే ఏకంగా మురుగు కాలువ పచ్చగా మైదానంలా దర్శనమిస్తుందంటే కాలువల బాగోగులను యంత్రాంగం ఏ స్థాయిలో విస్మరించిందో చెప్పకనే చెప్పవచ్చు. దీంతో గ్రామంలో ఎక్కడా మురుగు ముందుకు పారని పరిస్థితి కనిపిస్తుంది.

ఏడాది కిందట ఢిల్లీ స్థాయిలో పురస్కారం

సరిగ్గా ఏడాది కిందట ఇదే గ్రామ పంచాయతీ హెల్దీ పంచాయతీగా ఉత్తమ పురస్కారం అందుకుంది. సర్పంచ్, క్లాప్ మిత్రలు దేశ రాజధాని ఢిల్లీకి వెళ్లి 2024 జనవరి 26న అవార్డును అందుకున్నారు. అంతేకాదు గత ప్రభుత్వంలో జగనన్న స్వచ్ఛ సంకల్పంలో జిల్లా మొదటి ర్యాంకు సాధించింది. హెల్దీ విలేజ్ కేటగిరీలో రాష్ట్రస్థాయి అవార్డు కూడా దక్కింది. పంచాయతీరాజ్ దినోత్సవం, ఉగాది పురస్కారాల్లో అప్పటి సెక్రటరీలు, క్లాప్ మిత్రలు అవార్డులు అందుకున్నారు. అలాంటి ఉత్తమ పంచాయతీలో ఇప్పుడు మురుగు కాలువలు కూడా తీసే దిక్కులేకుండా పోయింది.

విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఏడుకొండలు మృతి



పెదకాకాని: అనారోగ్యంతో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కొర్నెపాటి ఏడుకొండలు (84)బుధవారం మరణించారు. పెదకాకాని మండలం వెనిగండ్ల గ్రామానికి చెందిన ఆయన రొంపిచర్ల మండలంలోని గోగులపాడులో మూడు ఎకరాల భూమిని ప్రభుత్వ పాఠశాలకు విరాళంగా అందజేశారు. జిల్లా పరిషత్ పాఠశాలగా తీర్చిదిద్దడంలో ఎనలేని కృషి చేశారు. కొర్నెపాటి ఏడుకొండలు, బసవరాజ్యం దంపతులకు ఐదుగురు కుమారులు, ఒక కుమార్తె సంతానం. వారిలో పెద్ద కుమారుడు కె. రమణారావు పాలిటెక్నిక్ కళాశాల హెచ్‌ఓడీగా పని చేస్తున్నారు. రెండో కుమారుడు కేవీ శ్రీనివాసరావు ఎస్పీగా, మూడో కుమారుడు కేవీ మోహనరావు రైల్వే ఐజీగా, కుమార్తె కళ్యాణి వెటర్నరీ డాక్టర్‌గా పని చేస్తున్నారు. నాలుగో కుమారుడు కె. హరిబాబు హోమియోపతి డాక్టర్‌గా, ఐదో కుమారుడు కె.హేమంత్ నాగరాజు ఎక్సైజ్ శాఖ డెప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రెండు రోజుల కిందట జ్వరం రావడంతో తాడేపల్లి మణిపాల్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం ఏడుకొండలు మృతి చెందారు. ఆయన పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించడంతో పాటు వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దిన ఆదర్శమూర్తిగా గుర్తింపు పొందారు. ఏడుకొండలు భౌతికకాయాన్ని పలువురు ప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు. గురువారం వెనిగండ్ల శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

అవకాశవాద రాజకీయాలు మానుకోవాలి: సీపీఎం



ప్రచారంలో మాట్లాడుతున్న నేతాజీ

పెదకాకాని: కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు అవకాశవాద రాజకీయాలు మానుకోవాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి వై. నేతాజీ అన్నారు. రాజధాని నిర్మాణం, రాష్ట్ర అభివృద్ధి జాతా కార్యక్రమంలో భాగంగా గురువారం పెదకాకానిలో ఆయన మాట్లాడారు. రాజధానికి నిధులు అప్పుగా కాకుండా కేంద్ర ప్రభుత్వం గ్రాంట్‌గా ఇవ్వాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌కు శాశ్వత రాజధాని లేకపోవడం శోచనీయమన్నారు. రాజధానికి 33 కేంద్ర ప్రభుత్వ సంస్థలు వస్తాయి అని చెప్పి, నేటికీ ఒక్కటీ కూడా శంకుస్థాపన జరగకపోవడం చూస్తే మసి పూసి మారేడు కాయ చందంగా ఉందని తెలిపారు. మొదటి నుంచి సీపీఎం అమరావతి శాశ్వత రాజధాని అనే దానికి కట్టుబడి ఉందిని గుర్తు చేశారు. ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో నెల్లూరులో జరిగే రాష్ట్ర 27వ మహాసభల్లో రాజధానికి చట్టబద్ధత, నిర్మాణం, కేంద్ర ప్రభుత్వ గ్రాంటు, విభజన హామీలు అమలు, రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోరుతూ పలు అంశాలపై చర్చించనున్నట్లు ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పాశం రామారావు, ఎం.రవి, ఈమని అప్పారావు, మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ, ఉల్లంఘల శివయ్య, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రైతు విభాగం జిల్లా అధ్యక్షుడిగా నల్లమోతు



నల్లమోతు శివరామకృష్ణ

కాకుమాను: వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడిగా కాకుమాను మండలానికి చెందిన వ్యవసాయ సలహా మండలి జిల్లా మాజీ చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధిష్టానం ఆదేశాలకు అనుగుణంగా పని చేస్తానని తెలిపారు. జిల్లాలో రైతు సమస్యలపై పోరాటాలు చేసి వారికి అన్ని విధాలుగా అండగా ఉంటానని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ నాయకులు శివరామకృష్ణను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

జిల్లా కమిటీలో బత్తుల, వెలగాకు చోటు

చేబ్రోలు: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం పార్టీ జిల్లా కమిటీలో చేబ్రోలు మండలానికి చెందిన ఇద్దరికి స్థానం లభించింది. మండల పరిధిలోని సుద్దపల్లి గ్రామానికి చెందిన జెడ్పీ వైస్ చైర్మన్ బత్తుల అనూరాధ భర్త గోవిందరాజులును ఆర్గనైజేషనల్ కార్యదర్శిగా, నారాకోడూరు గ్రామానికి చెందిన వెలగా కృష్ణను యాక్టివిటీ కార్యదర్శిగా నియమిస్తూ ఆదేశాలు ఇచ్చినట్లు పార్టీ కేంద్ర కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది.

ఉర్దూ పాఠశాలలను విలీనం చేయొద్దు

అవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఏ. చిస్టి



లక్ష్మీపురం: 117 జీఓను రద్దు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం శుభ పరిణామమని అవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఏ. చిస్టి పేర్కొన్నారు. ఈ జీవో వల్ల గతంలో ప్రాథమిక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారిపోయాయని తెలిపారు. స్థానిక పొన్నూరు రోడ్డులోని అవాజ్ కమిటీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం మైనారిటీ భాషల పాఠశాలలను కొనసాగించిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రజలతో, ఉపాధ్యాయ సంఘాలతో, విద్యార్థి సంఘాలతో చర్చించకుండా డీఈవోల ద్వారా ప్రధానోపాధ్యాయులపై అధికారులు ఒత్తిడి తెచ్చి పాఠశాలలు విలీనం చేయాలని చూడడాన్ని ఆయన ఖండించారు. ఉర్దూ భాషను నిర్వీర్యం చేసే దిశగా ప్రభుత్వ చర్యలు చేపడుతోందని విమర్శించారు. ఉర్దూ భాష పరిరక్షణ కోసం తెలుగు పాఠశాలలో విలీనం చేయవద్దని, అవసరమైతే ఉర్దూ మీడియంలో మోడల్ ప్రైమరీ స్కూళ్లను ఏర్పాటు చేయాలని కోరారు. తెలుగు మీడియం పాఠశాలల్లో ఉర్దూ సెక్షన్‌గా ఉన్న పోస్టులను కూడా కొనసాగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఘనంగా బలసాని జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: కార్యకర్తల మధ్య జన్మదిన వేడుకలను జరుపుకోవడం సంతోషంగా ఉందని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బలసాని కిరణ్ కుమార్ తెలిపారు. ఏటుకూరు బైపాస్‌లోని నియోజకవర్గ కార్యాలయంలో గురువారం జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య వేడుకగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ శ్రేణుల మధ్య కిరణ్‌కుమార్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు.

ఇచ్చిన మాటకు బాబు, పవన్ కట్టుబడి ఉంటారా ?

తూర్పు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలి

లక్ష్మీపురం: వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఎన్నికల సమయంలో చెప్పినట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కట్టుబడి ఉంటారా ? అని కాంగ్రెస్ పార్టీ గుంటూరు తూర్పు నియోజకవర్గ మాజీ శాసన సభ్యులు షేక్ మస్తాన్‌వలి ప్రశ్నించారు. పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. రాబోయే రోజుల్లో పార్లమెంట్‌లో బిల్లు ఆమోదానికి వస్తున్న సందర్భంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గతంలో చెప్పినట్లు వ్యతిరేకించటానికి కట్టుబడి ఉన్నారో లేదో స్పష్టం చేయాలని కోరారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా తేల్చి చెప్పాలని ఆయన ప్రశ్నించారు.

ఆస్తి రిజిస్ట్రేషన్ చేయకుండా ఇబ్బంది పెడుతున్న రిజిస్ట్రార్

బ్యాంక్ ప్రతినిధుల ఆరోపణ

పెదకాకాని: వేలంలో పాడుకున్న వ్యక్తికి రిజిస్ట్రేషన్ చేయ్యకుండా రిజిస్ట్రార్ ఇబ్బందులు పెడుతున్నాడని బ్యాంక్ ప్రతినిధులు పేర్కొన్నారు. పెదకాకాని మండలంలోని తక్కెళ్లపాడు శివారులో నిర్మించిన కల్యాణ మండపాన్ని యజమాని ష్యూరిటీగా పెట్టి కెనరా బ్యాంక్ గుంటూరు బ్యాంచిలో రుణం పొందాడు. సకాలంలో రుణం చెల్లించకపోవడంతో బ్యాంకు నిబంధనల మేరకు స్వాధీనం చేసుకుని ఆక్షన్ (వేలం) వేశారు. పాటలో ఓ వ్యక్తి పాడుకున్నాడు. పాట ప్రకారం నగదు చెల్లించడంతో బ్యాంక్ అధికారులు సంబంధిత కల్యాణ మండపానికి డాక్యుమెంట్ తయారు చేసి రిజిస్ట్రేషన్ చేయాలని పెదకాకాని రిజిస్ట్రార్‌ను కోరారు. కొద్దిరోజులు సమయం కావాలని కోరిన రిజిస్ట్రార్, వారం రోజుల తరువాత ఆ ఆస్తిని రిజిస్ట్రేషన్ చేయవద్దని తహసీల్దార్ కార్యాలయం నుంచి కోరినందున తాత్కాలికంగా ఆపడం జరిగిందని బ్యాంకు అధికారులకు లిఖిత పూర్వకంగా సమాధానం చెప్పాడు. దీనిపై పెదకాకాని తహసీల్దార్ పి. కృష్ణకాంత్‌ను వివరణ కోరగా కల్యాణ మండపం రిజిస్ట్రేషన్ నిలిపివేయాలని రిజిస్ట్రార్‌ను కోరలేదని తెలిపారు. రిజిస్ట్రేషన్ చెయ్యాలా.. వద్దా ? అనేది తమకు సంబంధించిన అంశం కాదని, బ్యాంకు అధికారులు, రిజిస్ట్రార్‌ల వ్యవహారమని తేల్చి చెప్పారు.

కోయంబత్తూర్ వెళ్లనున్న కమిషనర్

నెహ్రూనగర్: గుంటూరు నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు కోయంబత్తూర్ వెళ్లనున్నారు. ఈనెల 31, ఫిబ్రవరి 1వ తేదీల్లో తాగునీరు అంశంపై కోయంబత్తూర్‌లో జరిగే రీజనల్ వర్క్ షాప్‌లో పాల్గొననున్నారు. తిరిగి ఫిబ్రవరి 2న కమిషనర్ అందుబాటులో ఉంటారు. అప్పటి వరకు అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు ఇన్‌చార్జ్ కమిషనర్‌గా వ్యవహరించనున్నారు .

బ్యాక్టీరియా వల్ల కుష్ఠు వ్యాధి వ్యాప్తి



గొట్టిపాడు పీహెచ్‌సీలో సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్యాధికారి డాక్టర్ హేమంత్



ఆరోగ్య కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ఎస్. రామాంజిరెడ్డి

ప్రత్తిపాడు: బ్యాక్టీరియా వల్ల కుష్ఠు వ్యాధి వ్యాపిస్తుందని, ఇది సాధారణమైన వ్యాధేనని ప్రత్తిపాడు కోలోకేటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎం. దుర్గాప్రసాద్ అన్నారు. వ్యాధిపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించేందుకు వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో స్పర్శ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గురువారం నియోజకవర్గ కేంద్రంలోని మసీదు సెంటరులో వైద్యసిబ్బంది వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. డాక్టర్ దుర్గాప్రసాద్ ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెవులు, ముఖం, కాళ్లు, చేతులపై స్పర్శలేని మచ్చలు ఉన్నా, కనురెప్పలు, కనుబొమ్మలపై వెంట్రుకలు రాలడం వంటివి కుష్ఠు వ్యాధి లక్షణాలని తెలిపారు. అలాంటి వారు వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మ, ఏఎన్‌ఎంలు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

- గొట్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ ఏ. హేమంత్ ఆధ్వర్యంలో లెప్రసీపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, స్టాఫ్‌నర్సులు, ఆశా కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ హేమంత్ మాట్లాడుతూ కుష్ఠు వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించడం ద్వారా మెరుగైన వైద్యం అందించడం సాధ్యపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో చెల్లమ్మ పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధి నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత

పెదకాకాని: కుష్ఠు వ్యాధి నిర్మూలన ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎస్. రామాంజిరెడ్డి అన్నారు. పెదకాకాని మండలంలోని వెనిగండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం స్పర్శ లెప్రసీపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రామాంజిరెడ్డి మాట్లాడుతూ సమాజంలో కుష్ఠు వ్యాధిగ్రస్తులపై వివక్ష, సామాజిక రుగ్మతలు ఉండకూడదని తెలిపారు. వ్యాధి లక్షణాలతో పాటు చికిత్స విధానం గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ నిర్వర్తించవలసిన బాధ్యతలను వివరించి, ప్రతిజ్ఞ చేయించారు. ముందుగా జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ శ్రీనివాసరావు, పీహెచ్ఎన్ ఎం. భవాని, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

ఏఐతో త్వరితగతిన ఔషధాల డేటా విశ్లేషణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ పాటిల్

గుంటూరు రూరల్: మండలంలోని చౌడవరం గల చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాలలో కృత్రిమ మేధస్సు ద్వారా ఔషధ రూపకల్పన, అభివృద్ధి అనే అంశంపై గురువారం అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. విద్యాధర్ అధ్యక్షత వహించారు. ఓప్పోరెంట్ ఫార్మ ఫెడరేషన్, ఐపీఏ ఏపీ స్టేట్ బ్రాంచ్ సహకారంతో సదస్సును నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ మోంటుకుమార్ ఎం .పాటిల్ మాట్లాడుతూ ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ ద్వారా ఔషధాల డేటాను త్వరితగతిన విశ్లేషించవచ్చని తెలిపారు. పరస్పర చర్యలను సులభ పద్ధతిలో అన్వేషించవచ్చని, ప్రొటీన్, డ్రగ్ ఇంటరాక్షన్ స్టడీస్ గుర్తించడంలో ఏఐ ఎంతో సహకరిస్తుందని చెప్పారు. ఏపీ ప్రైవేట్ ఫార్మసీ కళాశాలల మేనేజ్‌మెంట్ ప్రెసిడెంట్ డాక్టర్ టీవీ నారాయణ మాట్లాడుతూ ఏఐ భవిష్యత్ తరాలకు ఎంతో ఉపయోగకరమని, దీన్ని ఫార్మసీ రంగం అందిపుచ్చుకుని ఉన్నతమైన స్థానాలకు చేరవచ్చని తెలిపారు. ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఈసీ సభ్యుడు డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలంటే నూతన టెక్నాలజీలపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పీసీఐ సభ్యుడు ఎం. నిరంజన్‌బాబు, ఎస్.ఎల్.ఎస్. ప్రసాద్‌రెడ్డి, ఎం. రాధాకృష్ణమూర్తి, ఏపీ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ విలియం క్యారి, పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

చేబ్రోలు: మండలంలోని శలపాడులో ఇంటి ముందు ఉంచిన ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. గ్రామానికి చెందిన సింహాద్రి సాంబశివరావు బుధవారం రాత్రి తన మోపెడ్‌ను ఇంటి ముందు ఉంచాడు. తెల్లవారి చూసే సరికి మాయమైంది. పరిసర ప్రాంతాలు గాలించినా ఆచూకీ తెలియలేదు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

జాతిపిత మహాత్మా గాంధీకి ఘన నివాళి



జెడ్పీ హైస్కూల్‌లో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మహా సభ సభ్యులు



గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మురళీకృష్ణ, నాయకులు



గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న తహసీల్దార్ వెంకటస్వామి

పొన్నూరు: అహింస, సత్యాగ్రహాలను ఆయుధాలుగా మలుచుకుని భారత దేశానికి స్వాతంత్య్రం అందించిన మహనీయుడు జాతిపిత మహాత్మా గాంధీ అని వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ కొనియాడారు.మండలంలోని మామిళ్లపల్లిలో గురువారం జాతిపిత వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి మురళీకృష్ణతో పాటు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం ప్రధాన భూమిక పోషించిన మహాత్మ గాంధీని నేటి యువత స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బుడే, మాజీ సర్పంచ్ పిచ్చిరెడ్డి, అంకిరెడ్డి, ఇక్కుర్తి చలపతి, మిరియాల సీతయ్య, పాల్గొన్నారు.

- ఆర్యవైశ్య మహా సభ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ 77వ వర్ధంతిని నిర్వహించారు. నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మహాసభ రాష్ట్ర కార్యదర్శి బాపనపల్లి ప్రభాకర లక్ష్మీ ప్రసాదరావు, జిల్లా ఆర్యవైశ్య సంఘ ఉపాధ్యక్షులు అవ్వారు వెంకటేశ్వరావు, లింగమల్లు మోహనకృష్ణ, అవ్వారు వెంకట సుబ్బారావు, గండు శ్రీనివాసరావు, జీఎంఎస్ గుప్తా, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బొలిశెట్టి రోశయ్య గుప్త పాల్గొన్నారు.

శాంతి, అహింసలతోనే సమ సమాజాభివృద్ధి

కాకుమాను: శాంతి, అహింసల ద్వారానే సమ సమాజాభివృద్ధి సాధ్యపడుతుందని తహసీల్దార్ బి.వెంకటస్వామి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం జాతిపిత వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ శాంతి, అహింసలను ఆయుధాలుగా చేసుకుని దేశానికి స్వాతంత్ర్యాన్ని తీసుకువచ్చిన గొప్ప వ్యక్తి మహాత్మ గాంధీ అని కొనియాడారు. నేటి యువత, విద్యార్థులు ఆయన్ను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని తెలిపారు.

వైద్య రంగానికి వన్నె తెచ్చిన డాక్టర్ నాగేశ్వరరెడ్డి



గుంటూరు మెడికల్: దేశంలో రెండో అత్యుత్తమ అవార్డు అయిన పద్మ విభూషణ్‌కు ఎంపికైన డాక్టర్ నాగేశ్వరరెడ్డి వైద్య రంగానికి వన్నె తెచ్చారని సీనియర్ జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్ డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి తెలిపారు. పద్మ విభూషణ్ అవార్డుకు ఎంపికైన నేపథ్యంలో డాక్టర్ నరేంద్రరెడ్డి హైదరాబాదులోని ఏఐజీ హాస్పిటల్‌లో డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డిని కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నరేంద్రరెడ్డి మాట్లాడుతూ ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా సమయంలో నాగేశ్వర్‌రెడ్డి ధైర్యం చెప్పి ఆహార నియమాలు పాటించేలా చేసి లక్షలాది మందిని కాపాడారని గుర్తు చేశారు. వైద్య రంగంలో విశేష కృషి చేసి తమకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఆయన పద్మ విభూషణ్‌కు ఎంపికవ్వడం రెండు తెలుగు రాష్ట్రాల వైద్యులకు గర్వకారణమని డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి పేర్కొన్నారు.